
www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 22 డిసెంబర్ 2023



అంగన్‌వాడీల 'జీవన పోరాటం'



వైసిపి 'రాజకీయ ఆరాటం'



సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పది రోజులుగా అంగన్‌వాడీలు నిరవధిక సమ్మె చేస్తుంటే పట్టించుకోని వైఎస్‌ఆర్‌సిపి నేతలు గురువారం సిఎం పుట్టినరోజు వేడుకలను జిల్లావ్యాప్తంగా అట్టహాసంగా భారీ కేకులు కట్ చేసి ఆర్భాటం చేశారు.. ఒకరిది జీవన పోరాటమైతే.. మరొకరిది రాజకీయ ఆరాటం..



శ్రీకాళహస్తిలో 'ఒకే ఒక్కడు'



పుత్తూరులో లబ్దిదారుల సంఘీభావం



ఒకరికి 'ఇద్దరు'

సచివాలయ సిబ్బందికి... 'ఆట' విడుపు..!

పుడ్డు లేదు..గుడ్డూ లేదు
కేంద్రాలకు రాని చిన్నారులు
ఉధృతంగా అంగన్‌వాడీల సమ్మె
ప్రజాసంఘాలు, లబ్దిదారుల మద్దతు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి

తమ న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం గత పది రోజులుగా ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద అంగన్వాడీలు నిరవధిక సమ్మె చేస్తున్నారు. ప్రభుత్వం ఎన్ని బెదిరింపులకు పాల్పడినా, అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టి సచివాలయ ఉద్యోగుల చేతుల్లో పెట్టినా అంగన్వాడీలు వెనక్కు తగ్గని పరిస్థితి. అదే రీతిన రాష్ట్ర ప్రభుత్వమూ అంగన్వాడీల సమస్యలను పట్టించుకోకపోగా, సమ్మెను నిర్వీర్యం చేసే ధోరణిలో సచివాలయ ఉద్యోగులను అంగన్వాడీలపై ఉసిగొలిపి వేడుక చూసే పనిలో పడింది. ఈ నేపథ్యంలో ఆ రెండు శాఖల ఉద్యోగుల్లో సంఘర్షణ మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెల 18వ తేదీ నుంచి సచివాలయ ఉద్యోగులు శ్రీకాళహస్తి నియోజకవర్గం లోని అన్ని అంగన్వాడి కేంద్రాల తాళాలు పగలగొట్టి కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. దీంతో సచివాలయ ఉద్యోగుల తీరుపై చాలాచోట్ల అంగన్వాడీలు తిరగబడ్డారు. ఏ ఏ అంగన్వాడి కేంద్రాల్లో ఎవరెవరు సచివాలయ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారో వారిపై కేసులు పెట్టేందుకు అంగన్వాడీలు సమాయత్తమవుతున్న పరిస్థితి కనబడుతోంది. చిన్నారుల తల్లిదండ్రులు అంగన్వాడీలకు అండగా నిలబడుతున్నారు. అయితే గత ఐదు రోజులుగా సచివాలయ ఉద్యోగులు అంగన్వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నా ఎక్కడా భోజనం వండి చిన్నారులకు వడ్డించిన దాఖలాలు కనిపించడం లేదు. ఓ రకంగా సచివాలయ సిబ్బందికి ఆటవిడుపుగా ఈ విధులు ఉన్నాయి. గుర్రం చేయాల్సిన పని గుర్రం, గాడిద చేయాల్సిన పని గాడిద చేయాలని, ఈ ప్రభుత్వ హయాంలో అంతా 'రివర్స్‌గేర్'గా ఉందని లబ్దిదారులు మండిపడుతున్నారు.

అలా వచ్చి..ఇలా పోతున్నారు

శ్రీకాళహస్తి ఐసిడిఎస్ శాఖ పరిధిలో 207 అంగన్వాడి కేంద్రాలను నడుపుతున్నారు. ఈ కేంద్రాల్లో 3 వేల పైచిలుకు ప్రీ స్కూల్ విద్యార్థులు, 2500 పై చిలుకు బాలింతలు, గర్భవతులు, కిశోర బాలికలు పౌష్టికాహారం పొందుతున్నారు. వీళ్ళ ఆలనా పాలనా గత 30 ఏళ్లుగా అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, మినీ కార్యకర్తలు చూసుకుంటూ వస్తున్నారు. అయితే అంగన్వాడీ డిమాండ్ల సాధన పై ప్రభుత్వం, అంగన్వాడీ నాయకుల మధ్య జరిగిన చర్చలు విఫలమైన నేపథ్యంలో నిరవధిక సమ్మెకు దిగారు. దీంతో ప్రభుత్వం అంగన్వాడీలకు సమాంతరంగా కేంద్రాలను నడిపే బాధ్యతలు సచివాలయ ఉద్యోగులకు అప్పచెప్పింది. వీరంతా ఈనెల 18వ తేదీ నుంచి అంగన్వాడి కేంద్రాలను నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే ఏ కేంద్రానికి వెళ్లినా ఖాళీగా ఉన్న అంగన్వాడీ కేంద్రాలు మాత్రమే దర్శనమిస్తున్నాయి. అక్కడ చిన్నారులు గానీ, గర్భవతులు, బాలింతలు, కిశోర బాలికలు కాన రావడం లేదు. గర్భవతులు, బాలింతలు, కిశోర బాలికలకు టేక్ హోమ్ రేషన్ పద్ధతిలో పౌష్టికాహారం ఇంటికే అందుతోన్న నేపథ్యంలో కనీసం చిన్నారులు కూడా కేంద్రాల్లో కనిపించడం లేదు. సాధారణంగా అంగన్వాడి కేంద్రాలను ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే సచివాలయ ఉద్యోగులు మాత్రం ఉదయం 9 గంటలకే కార్యాలయం తెరిచి మధ్యాహ్నం 12 గంటలకు మూసేస్తున్నారు. 'ప్రజాశక్తి' పరిశీలనలో భాగంగా శ్రీకాళహస్తి పట్టణంలోని దర్గా మిట్ట, కొత్తపేట ఆర్టీసీ బస్టాండ్ అంగన్వాడి కేంద్రాలను గురువారం తనిఖీ చేసింది. ఈ రెండు కేంద్రాల్లో ఒక్కొక్క విద్యార్థి మాత్రమే దర్శనమివ్వడం గమనార్హం.

❀ తిరుపతిలో సిఐటియు నాయకులు పి.బుజ్జి, అంగన్‌వాడీ నాయకులు నాగరాజమ్మ, హేమలత, గోమతి, వరలక్ష్మి, గీతాంజలి, సుజిత, వనజ, రాజరాజేశ్వరి, గీత, అరుణ పాల్గొన్నారు.

❀ శ్రీకాళహస్తిలో ఎల్ఐసి యూనియన్ కార్యదర్శి సురేష్‌బాబు, అధ్యక్షులు సాయి మద్దతు తెలిపారు. పది రోజులుగా విధులను, కుటుంబాలను పక్కనపెట్టి పోరాటం చేస్తున్న అంగన్‌వాడీలను అభినందించారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీల వేతనాల్లేవన్నారు. అనంతరం ఎపి సీడ్స్ సర్కిల్ వద్ద మానవహారం నిర్వహించారు. తాము పొట్ట చేతబట్టుకుని న్యాయం చేయండి జగనన్నా అంటూ గుండెలు బాదుకుంటుంటే, ముఖ్యమంత్రి జన్మదిన సంబరాల్లో మునిగితేలడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి యూనియన్ నాయకులు గోపీనాథ్, జహంగీర్, కష్ణమూర్తి, సీఐటీయూ నాయకులు అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, గంధం మణి, రేవతి, సుబ్రమణ్యం, పుష్ప, సౌజన్య, సక్కుభాయమ్మ, స్వర్ణ, రాజా తదితరులు పాల్గొన్నారు.

❀ పిచ్చాటూరులో టిడిపి మాజీ మండల అధ్యక్షులు రామచంద్రరాజు, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అరుణ్ ప్రకాష్, రవి, మునిక్రిష్ణనాయుడు మద్దతు ప్రకటించారు.

❀ సత్యవేడులో సిఐటియు నాయకులు ఎం.రమేష్ ఆధ్వర్యంలో భిక్షాటన చేశారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్మల, శాంతి, భారతి, కాంతమ్మ, భువన, ఝాన్సీ, సరస్వతి,రాజేశ్వరి పాల్గొన్నారు.

❀ రేణిగుంటలో ఏర్పేడు మండల నాయకులు కరీముల్లా, లక్ష్మమ్మ, భాగ్య, హసీనా, గోవిందమ్మ పాల్గొన్నారు. అంగన్‌వాడీల ఓపికని పరీక్షించవద్దని హెచ్చరించారు. యుటిఎఫ్ నేతలు 1,116 రూపాయలు ఇచ్చి మద్దతు తెలిపారు. 'ఆటపాట-సెప్పులతో' సమ్మెలో పాల్గొన్నారు. భిక్షాటన చేసిన వచ్చిన డబ్బుతో కూరగాయలు తెచ్చి వంటావార్పు చేశారు. మంచినీళ్లగుంట వద్ద మానవహారం నిర్వహించారు. యుటిఎఫ్ అధ్యక్షులు శేఖర్, మండల కార్యదర్శి మురళి పాల్గొన్నారు.

❀ నాయుడుపేట చికెన్ మార్కెట్ సెంటర్ సమీపంలో అంగన్‌వాడీ కార్యకర్తలు భారీ స్థాయిలో మానవహారం చేపట్టారు. సిఐటియు మండల కార్యదర్శి శివకవి ముకుంద, చావల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే వైసిపి పతనం తప్పదని హెచ్చరించారు. అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యదర్శి శ్యామలమ్మ, మేరీ, ఐద్వా నాయకురాలు చంద్రకళ పాల్గొన్నారు.

❀ గూడూరులో రైతుసంఘం నాయకులు జోగి శివకుమార్, అంగన్‌వాడీ అధ్యక్షురాలు ఎ.ఇంద్రావతి, సిఐటియు నాయకులు బివి రమణయ్య, కార్యదర్శి ఎస్.సురేష్ పాల్గొన్నారు.

అంగన్వాడీలే నిర్వహించాలి: నవనీతమ్మ, కొత్తపేట



గత ఐదు రోజులుగా మా వీధిలో సచివాలయ ఉద్యోగులు అంగన్వాడీ కేంద్రం నడుపుతున్నారు. అయితే కేంద్రాలకు వెళ్లేందుకు మా పిల్లలు వెనకడుగు వేస్తున్నారు. సచివాలయ ఉద్యోగులు ఇలా వచ్చామా..అలా వెళ్లామా అన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. వారికి ఎంత మంది పిల్లలు ఆ కేంద్రాల్లో చదువుతున్నారో కూడా తెలియదు. అలాంటివారు కేంద్రాలను ఎలా నడుపుతారు. ప్రభుత్వం వెంటనే అంగన్వాడీ సమస్యలను పరిష్కరించి కేంద్రాల నిర్వహణ వారికే అప్పజెప్పాలి.

చంద్రగిరిలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మద్దతు



చంద్రగిరిలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వద్ద రోడ్డుపైనే ఆందోళన చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆయన మాస్క్ ధరించి ప్లేట్లతో నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, యూనియన్ జిల్లా కార్యదర్శి వాణి, డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.జయచంద్ర, సిఐటియు జిల్లా నాయకులు లక్ష్మి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా వైసిపి అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మద్దతు ప్రకటించారు. ప్రభుత్వంతో మాట్లాడి న్యాయం చేస్తామని తెలిపారు. అనంతరం అంగన్‌వాడీలో రోడ్లపై భిక్షాటన చేశారు. ఈ కార్యక్రమంలో విజయ కుమారి, నాగభూషణమ్మ, లీలా, నాగరాజమ్మ, ప్రియదర్శిని పాల్గొన్నారు.

లబ్దిదారులకు ప్రభుత్వ బెదిరింపులు

ప్రజాశక్తి - బాలాయపల్లి అత్యధిక కేంద్రాలకు పిల్లలు రాకపోవడంతో అంగన్వాడీ కేంద్రాలు ఖాళీగా దర్శనమిచ్చాయి. కేవలం సచివాలయం సిబ్బంది మాత్రమే అంగన్వాడీ కేంద్రల్లో ఉన్నారు. తల్లిదండ్రులు పిల్లలను అంగ న్వాడి కేంద్రాలకి పంపకపోతే ప్రభుత్వం నుంచి ఎటువంటి సంక్షేమ పథకాలు రావని బెదిరిస్తు న్నట్లు తల్లిదండ్రులు వాపోతున్నారు. దీంతో అరకొరగా పిల్లల్ని పంపిస్తున్నామని చెబుతున్నారు.

పుత్తూరులో లబ్దిదారుల సంఘీభావం

పుత్తూరులో అంగన్‌వాడీల సమ్మెకు పిల్లల తల్లిదండ్రులు మద్దతుగా నిలిచారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్ మాట్లాడుతూ సమ్మెకు లబ్దిదారులు మద్దతు తెలపడం సంతోషకరమన్నారు. అంగన్‌వాడీ టీచర్లు ఉండేటపుడు పిల్లలను బాగా చూసుకునేవారని, బోజనం బాగా పెట్టేవారని, సచివాలయ ఆఫీసు ద్వారా పిల్లలకు సరైన భోజనం అందడం లేదన్నారు. మునికుమారి, విజయ్‌కుమారి, ధనమ్మ, రాధ, పద్మజ, లలిత, హైమావతి, లక్ష్మీ, అన్నపూర్ణ, గంగులమ్మ, జయంతి పాల్గొన్నారు. టిడిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి గాలి భానుప్రకాష్ పదివేల రూపాయల ఆర్థిక సాయం అంగన్‌వాడీల సంఘీభావనిధిగా అందించారు. టిడిపి నాయకులు గంజి మాధవయ్య, జి.జీవరత్నంనాయుడు, డి.రవికుమార్ పాల్గొన్నారు



శ్రీకాళహస్తిలో మానవహారం

అట్టహాసంగా జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఎన్నికల వేళ.. సిఎం జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు అట్టహాసంగా జరిగింది. తడలో ఎంఎల్‌ఎ కిలివేటి సంజీవయ్య, పిచ్చాటూరులో ఎంఎల్‌ఎ కోనేటి ఆదిమూలం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఓజిలిలో మండల కన్వీనర్ హరినాథ్‌రెడ్డి, జడ్‌పిటిసి రవీంద్రరాజు ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి పంచిపెట్టారు. శ్రీకాళహస్తిలో ఎంఎల్‌ఎ బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నాయి బ్రాహ్మణులు, జంగమ దేవరులు, టైలర్లు, చిరు వ్యాపారులకు ప్రత్యేక స్టాళు ఏర్పాటు చేసి వారి వత్తులకు సంబంధించిన పనిముట్లను ఉచితంగా వితరణ చేశారు. వైఎస్‌ఆర్ విగ్రహం వద్దకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కెవిబిపురంలో మండల కన్వీనర్ గవర్ల క్రిష్ణయ్య ఆధ్వర్యంలో జరిగింది. గూడూరులో ఎంఎల్‌ఎ వరప్రసాద్‌రావు, ఎంఎల్‌సి మేరిగ మురళీధర్ నిర్వహించారు. విజయవాడలో ఎప బిషప్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ ప్రవీణ్ పాల్గొని సిఎంకు శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ వైఎస్‌ఆర్ ప్రజాప్రస్థానం సేవా ట్రస్టు ఛైర్మన్ డాక్టర్ పిసిరాయులు ఆధ్వర్యంలో 500 మందికి అన్నదానం చేశారు. వరదయ్యపాలెంలో మండల కన్వీనర్ దయాకర్‌రెడ్డి, నాయుడుపేటలో జడ్‌పిటిసి



గూడూరులో..

జ్యోతిరెడ్డి ఆధ్వర్యంలో మేనకూరు సచివాలయంలో వేడుకలు నిర్వహించారు. బిఎన్‌కండ్రిగలో వైసిపి జిల్లా సోషల్ మీడియా కోకన్వీనర్ వేలూరి రాకేష్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ సంధ్య ఆధ్వర్యంలోకేక్ కట్‌చేసి అన్నదానం చేశారు. బాలాయపల్లిలో పార్టీ కన్వీనర్ వెందోటి కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్‌చేశారు. రామచంద్రాపురంలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. పుత్తూరు అంబేద్కర్ సర్కిల్ వద్ద మున్సిపల్ ఛైర్మన్ ఆనంగి హరి ఆధ్వర్యంలో 700 మందికి అన్నదానం చేశారు. ఎస్వీయూ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు డాక్టర్ బి.ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్ అలిపిరి బస్టాండ్ వద్ద పేదలకు అన్నదానం చేశారు. తిరుచానూరు సర్పంచి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.



శ్రీకాళహస్తిలో భారీ కేక్ కట్ చేసి సిఎం జన్మదినాన్ని వేడుకగా జరిపిన ఎంఎల్‌ఎ బియ్యపు మధుసూదన్‌రెడ్డి

తిరుపతిలో న్యాయవాదుల భారీ బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఏపీ భూహక్కు చట్టాన్ని వ్యతిరేకిస్తూ గురువారం తిరుపతి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నల్ల చట్టంగా న్యాయవాదులు అభివర్ణించారు. తిరుపతి కోర్టు ప్రాంగణం నుంచి సుమారు 300 మంది న్యాయవాదులు తిరుపతి పురవీధుల మీదుగా బైక్ ర్యాలీ చేపట్టారు. ఆర్టీసీ బస్టాండ్ ముందు ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందించారు. అంతకు ముందు నాలుగు కాళ్ళ మండపం, అంబేద్కర్ విగ్రహం, పాత మునిసిపల్ ఆఫీస్, భవానీ నగర్, స్విమ్స్ కూడలి, ఎన్టీఆర్ సర్కిల్ ముందు నిరసనలతో హోరెత్తించారు. డిసెంబర్ 2 నుంచి తిరుపతి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టులకు హాజరుకాకుండా విధులను బహిష్కరించి నిరసనలు చేపడుతున్నారు. దశలవారీగా వివిధ రూపాలలో నిరసనలు చేపట్టేందుకు బార్ అసోసియేషన్ ప్రతినిధులు కార్యాచరణ రూపొందించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.వెంకట కుమార్, ఉపాధ్యక్షుడు టి. గోపిచంద్, ప్రధాన కార్యదర్శి ఎం.మురళి, మహిళా ప్రతినిధి వై.కె.మల్లీశ్వరిదేవి, సహాయ కార్యదర్శి గాలి మధు, సీనియర్ న్యాయవాదులు ఎం.ఎన్.మణి, చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు యోగానంద్, బి.ఉషాకిరణ్, టి.దినకర్, మావిళ్ల హరీష్, ఆనంద్, గిరి, మునెయ్య, కష్ణయ్య, రమేష్ , చంద్రయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



న్యాయవాదుల బైక్‌ర్యాలీ

కలిమి మీకు... కష్టాలు ఎస్ఎస్ఎలకా.. : సిఐటియు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'రాష్ట్రంలోని కలిమి వైసిపి ఎంఎల్‌ఎలకు, కష్టాలు ఎస్ఎస్ఎలకా' అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ప్రశ్నించారు. గురువారం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఎస్ఎస్ఎలు నిర్వహిస్తున్న సమ్మె శిబిరం వద్ద కందారపు మురళి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ సంస్థను జగన్మోహన్‌రెడ్డి అదానీ, అంబానీలకు పంచాలని నిర్ణయించుకున్నట్లుగా ఉందన్నారు. రాష్ట్రంలోని కష్టజీవుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాత్రధారులని గుర్తు చేశారు. పనులు చేయించుకునేటపుడు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా, జీతం గురించి మాట్లాడితే కేంద్రానికి సంబంధించిన వారుగా మాట్లాడటం సబబు కాదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలన్నారు. 34 మండలాల్లోని ఎస్ఎస్ఎ ఉద్యోగులు జిల్లా కేంద్రమైన తిరుపతికి వచ్చి నిరసన తెలియజేస్తున్నారన్నారని ఎస్ఎస్ఎ జిల్లా యూనియన్ నేతలు మునిక్రిష్ణ, ప్రదీప్ తెలిపారు. ఎస్ఎస్ఏ యూనియన్ నేతలు మాధవయ్య, వాసవి, మోహన్, ధనపాల్, జనార్ధన్, లలిత, ప్రసాద్, నవీన్ పాల్గొన్నారు. 'చెవిలో పువ్వు, పంగనామాలతో' వినూత్నంగా నిరసన తెలిపారు.

తుడా సెక్రటరీగా జి.వెంకట నారాయణ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్



తిరుపతి పట్టణాభివద్ధి సంస్థ(తుడా) సెక్రటరీ గా జి.వెంకట నారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తుడా ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి, వీసీ హరికష్ణ కు పుష్పగుచ్చం అందజేసి మర్యాద పూర్వకంగా కలిశారు. తిరుపతి రూరల్ ఎంపిడిఓ గా జి.వెంకట నారాయణ ఉద్యోగోన్నతిపై జిల్లా విజిలెన్స్ ఆఫీసర్‌గా వైఎస్సార్ కడప జిల్లాకు బదిలీపై వెళ్ళారు. తిరిగి అక్కడ నుంచి తుడా సెక్రటరీ గా బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సెక్రటరీ లక్ష్మీ మాత సంస్థకు రిపోర్ట్ చేసుకోనున్నారు.



శాస్త్రీయ ఆలోచనతోనే అభివృద్ధి

ప్రజాశక్తి - రేణిగుంట

మండలంలో చెకుముకి పోటీలు బాలుర పాఠశాలలో జరిగాయి. 16 ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పిహెచ్‌సి డాక్టర్ చత్రప్రకాష్ మాట్లాడుతూ సైన్స్ అభివృద్ధితోనే మానవుడు తన ఆరోగ్యాన్ని, ఆయుష్షును పెంచుకున్నాడన్నారు. మూఢనమ్మకాల వల్ల ఆరోగ్యాన్ని, జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. శాస్త్రీయ దృక్పథం అలవరచుకుంటేనే అభివృద్ధి అన్నారు. జెవివి మండల కార్యదర్శి కుప్పస్వామి, నాయకులు నాగరాజు, ఒ.వెంకటరమణ, లెక్కల టీచర్ అల్లాబక్ష్ ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలల్లో బాలుర పాఠశాల విద్యార్థుల బృందం, ప్రైవేట్ పాఠశాలల్లో రెయిన్‌బో స్కూల్ బృందం మొదటిస్థానంలో నిలిచాయి. వీరు జనవరి 7న తిరుపతి సైన్స్ సెంటర్ వద్ద జరగనున్న జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

కొన(వండ)లేం..!

కిలో కూరగాయలు రూ.60పైనే
వర్షాభావం, తుపానుతో తగ్గిన ఉత్పత్తి
రానున్న రోజుల్లోనూ మరింత ప్రియం
కార్తీకం ముగియడంతో 'చికెన్'కు రెక్కలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ మాసాల్లో వర్షాభావం.. డిసెంబర్‌లో మిచౌంగ్ తుపాను.. వెరశి కూరగాయల ధరలు మూడింతలు పెరిగాయి.. మార్కెట్లో ఏ కూరగాయ పట్టుకున్నా కిలో రూ.60పైనే ధర పలుకుతోంది. దీంతో మహిళలు కూరగాయలు కొనలేం, వండలేం అంటూ నిట్టూరుస్తున్నారు. కిలోలకు కిలోలు కొనే గృహిణులు పావుకేజీ, అరకేజీలతో సరిపెడుతున్నారు. కార్తీకమాసంలో భక్తులకు, అయ్యపస్వాములకు ఈ కూరగాయల ధరలు చుక్కలు చూపించాయంటే అతిశయోక్తి కాదు. కార్తీకమాసంలో ఎక్కువమంది కూరగాయల కంటే చికెన్ ఎక్కువ కొన్నారన్నది వాస్తవం. అయితే కార్తీకం అయిపోవడంతో ప్రస్తుతం చికెన్ ధరకూ రెక్కలొచ్చాయి. తుపానుకు మునగ, అరటి చెట్లు నేలవాలడంతో వాటి ధరలూ అందుబాటులో లేవు. రానున్న మూడు నాలుగు నెలలు కూరగాయల ధరలు ఈ విధంగానే ఉంటాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. కూరగాయలు కొనలేని కొంతమంది కర్రీపాయింట్లో 20-30కి కూరలు కొని సరిపెట్టుకోవడం గమనార్హం.

వెజ్‌కి నాన్‌వెజ్‌కి తేడానే లేదు

ఒకప్పుడు మాసం తినాలంటే మనస్థాయి కాదులే అనుకునే వాళ్లు. ఇప్పుడు ఆ పరిస్థితి తారుమారైంది. చికెన్ కన్నా కూరగాయలు రేట్లు పెరిగిపోయాయి. దీంతో కోడికూరే మేలనుకుంటున్నారు. కార్తీకమాసంలో చికెన్ కిలో 120 రూపాయలు అయితే చిక్కుడుకాయలు కిలో 120 వరకు పలుకుతున్నది. దీంతో చిక్కుడుకాయల జోలికి వెళ్లడం లేదు. కార్తీక మాసంలో చికెన్ ధరలు కొంతమేర తగ్గినా మళ్లీ పెరుగుతున్నాయి. మటన్ ఎప్పటిలాగే కిలో 800 రూపాయలకు విక్రయిస్తున్నారు. అధికారుల నియంత్రణ లేకపోవడంతో కూరగాయల ధరలకు రెక్కలు వస్తున్నాయని జనం ఆరోపిస్తున్నారు.

ఇంత రేట్లు ఎప్పడూ లేవు : పి.శాంతి, టిఫిన్ సెంటర్

కూరగాయలు తినే పరిస్థితి లేదు. ఇంత రేట్లు గతంలో ఎపుడూ లేవు. టమోటా, మిర్చి కొనుక్కెళ్లి పచ్చడి చేసుకుంటున్నాం. చిక్కుడుకాయ రూ. 120 ఉంది. సామాన్యులు తినే పరిస్థితి లేదు. ఈ ధరకు అరకిలో చికెన్ కొనుక్కోవచ్చు. టిఫిన్ సెంటర్లోనూ టమోటా, మిర్చి పొదుపుగా వాడుతున్నాం.

ఏం కొనేటట్లు లేదు : శోభ, తోపుడుబండి

తోపుడు బండిలో కూరగాయలు అమ్ముకునే మహిళ శోభ మాట్లాడుతూ కూరగాయలు ధరలు ఎన్నడూ లేని విధంగా పెరిగిపోయాయి. తిరుపతి మార్కెట్‌కు చాలా తక్కువగా కూరగాయలు వస్తున్నాయి. తుఫాను వల్ల పంటలు కొట్టుకొని పోవడం వల్ల ధరలు పెరిగిపోయాయి. నేను తోపుడు బండిలో ప్రతిరోజూ 5వేల రూపాయల సరుకులు తీసుకొచ్చి ఇంటింటా అమ్ముకునేదాన్ని. కూరగాయలు ధరలు పెరగడం వల్ల చాలా తక్కువగా కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు. కారణం ధరలు పెరగడమే. హోటల్లో, ఫాస్ట్ ఫుడ్ టిఫిన్ సెంటర్లో కూడా పొదుపుగా కూరగాయలు వాడుతున్నారు.

కూరగాయ రకాలు	ధర (కిలో)
బెండకాయ	రూ.60
దొండకాయ	రూ.60
గింజ చిక్కుడు	రూ.90
పచ్చిమిర్చి	రూ.50
కాకర, బీర	రూ.70
దోసకాయ	రూ.40
క్యాప్సికం	రూ.80
బంగాళదుంప	రూ.50
క్యాబేజీ	రూ.40
కంద, చామ	రూ.60
ఆకుకూర కట్ట	రూ.25
ఉల్లి కిలో	రూ.60



రాజ్యాంగ నైతికతపై వర్కుషాపు

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని లా డిపార్ట్మెంట్లో విద్యార్థినుల ఉపయోగార్థము డా.యస్.మాధురీ పరదేశి ఆధ్వర్యంలో వర్క్ షాప్ నిర్వహించారు. వర్క్ షాప్లో భాగంగా డా.అంబేద్కర్ లా యూనివర్సిటీ, తమిళనాడు, రిటైర్డ్ డీన్ అండ్ డైరెక్టర్, ప్రొఫెసర్ ఎ.రఘునాథ్ రెడ్డి, "రాజ్యాంగ నైతికత" అనే అంశం మీద వివరించారు. ప్రొఫెసర్ రెడ్డివరి రేవతి, హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్, డా. అంబేద్కర్ లా యూనివర్సిటీ, తమిళనాడు సంభాషించారు. యం.చోళరాజ,కె. విఘ్నేష్,ఎ.సలోమి భారత రాజ్యాంగ చట్టం, వాటిలోని కొత్త మార్పులు అనే అంశం మీద విద్యార్థినులకి వర్క్ షాప్లో ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డా.యస్.మాధురీ పరదేశి, హెడ్ ఆఫ్ లా డిపార్ట్మెంట్, ప్రొఫెసర్ డా.సీతా కుమారి, అసిస్టెంట్ ప్రొఫెసర్ సునీతా కాణిపాకం, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇందిరా ప్రియదర్శిని పాల్గొన్నారు.

సిటీ ఆపరేషన్ సెంటర్
త్వరగా పూర్తి చేయండి : కమిషనర్

తిరుపతి టౌన్ : తిరుపతి సిటీ ఆపరేషన్ సెంటర్ (సి. ఓ.సి), మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ (ఎం.ఎల్.సి.పి) భవనాల నిర్మాణ పనులు గడువులోపు సకాలంలో పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. నగరంలోని పాత మునిసిపల్ కార్యాలయం స్థానంలో స్మార్ట్ సిటీ నిధులతో నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్, రైల్వే స్టేషన్ సమీపంలో నిర్మిస్తున్న మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ భవన నిర్మాణ పనులను గురువారం ఇంజినీరింగ్ అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, డి.ఈ. విజయకుమార్ రెడ్డి, ఏఈకామ్ సంస్థ ప్రతినిధి బాలాజీ, అనిల్ పాల్గొన్నారు.

తిరుచానూరు రోడ్డుకు మహర్దశ

ప్రజాశక్తి-తిరుపతి సిటి: దశాబ్దాల కల నిజం కాబోతోంది. తిరుచానూరు 150 బైపాస్ నుంచి ఉప్పరపల్లి నారాయణాద్రి హాస్పిటల్ వరకు ఉన్న రోడ్డుకు మహర్దశ పట్టింది. ఎట్టికేలకు తిరుపతి డిప్యూటీ మేయరు, యువ నాయకులు భూమన కరుణాకర్‌రెడ్డి చొరవతో, టిటిడి చైర్మన్, తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్‌రెడ్డి సహకారంతో రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. ఎన్నో సంవత్సరాలుగా తిరుచానూరు రైల్వేస్టేషన్ నుంచి పద్మావతి అమ్మవారి ఆలయానికి వెళ్లే రోడ్డు నిత్యం గుంతలమయంగా ఉండేది. పందుల సంచారం. మురికికాల్వలు, డ్రైనేజీ నీటితో కాస్తో కూస్తో ఉన్న రోడ్డు కూడా వాహనాలకే కాదు, పాదాచారుల ప్రయాణికి సైతం ఇబ్బందికరంగా ఉండేది. మాస్టర్ ప్లాన్‌లో బాగంగా 2.25 కిలోమీటర్ల పొడవున 150అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణానికి అనుమతి వచ్చింది. రూ.13.29 కోట్ల రూపాయల వ్యయంతో మధ్యలో డివైడర్‌తో కూడిన 4 లేన్ల రోడ్డుకు టెండర్లు కూడా పూర్తయాయ్యి. ఇప్పటికే సర్వే పూర్తయింది. తొందర్లోనే పనులను సైతం ప్రారంబించి, అత్యంతవేగంగా చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ రోడ్డు పూర్తయితే శెట్టిపల్లి, మంగళం, ఉప్పరపల్లి, మిట్టగాంధీపురం, తిమ్మనాయుడు పాలెం, రణదీర్‌పూరం, చెన్నయ్‌గుంట, వెంకటాపురం, బిటిఆర్ కాలనీ, సప్తగిరి నగర్, శేషాచల కాలనీ, శివశంకర్ కాలనీ, కాటన్‌మిల్లు, ఆటోనగర్, మంగళం ఆర్‌టిసి డిపో, ఎస్టేట్‌కు చెందిన ప్రజలు కలెక్టరేట్‌కు, తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకునేందుకు, చిత్తూరు, పుత్తూరు, బెంగుళూరు, వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు తిరుపతి నగరంలో ప్రవేశించి, ట్రాఫిక్ ఇబ్బందులు పడకుండా ఈ మార్గం ద్వారా సులభంగా చేరుకోవచ్చును. దీంతో పాటు పూడి, అప్పలాయగుంట, తడుకు, రామచంద్రాపురం, తనపల్లి, కుంట్రపాకం, వెంకటరామాపురం, తిరుపతి రూరల్ పంచాయతీలకు వెళ్లేందుకు ఈ మార్గం ఎంతో అవసరమైనది. ఎట్టికేలకు ఈ రోడ్డును 4 లేన్లగా రూపొందించేందుకు చర్యలు చేపట్టిన అధికారులు, ప్రజాప్రతినిధులకు స్థానికులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. రోడ్డు పనులను త్వరతగతిన ప్రారంభించి, వీలైనంత తొందరగా అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.



విస్తరణకు అనుమతి వచ్చిన తిరుచానూరు 150 బైపార్‌రోడ్డు

అభినయ్ రెడ్డికి రుణపడి ఉంటాం..



దశాబ్దాల తరబడి అబివృద్ధికి నోచుకోని నారాయణాద్రి ఆసుపత్రి-తిరుచానూరు రోడ్డు పనులకు శ్రీకారం చుట్టేందుకు చొరవ చూపిన తిరుపతి డిప్యూటీ మేయరు భూమన అభినయ్ రెడ్డికి, టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి మా ప్రాంత వాసులు ఎప్పటికి రుణపడి ఉంటాం. అనేక సంవత్సరాలుగా ఈ రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదు. అనేక పార్టీలు, ప్రభుత్వాలు మారీనా ఈ రోడ్డు పరిస్థితి ఇలాగే ఉంది. ఒక అడుగు కూడా ముందుకు వెయ్యలేదు. ఎట్టికేలకు అభినయ్‌రెడ్డి చొరవ చూపడంతో రోడ్డు పనులు ముందుకు వెల్లడం శుభపరిణామం. త్వరలోనే రోడ్లు పూర్తయి, స్తానికులు అందుబాటులోకి రానున్నాయి. మరొక్కసారి అబినయ్‌రెడ్డికి కృతజ్ఞతలు.

- కె.రామకృష్ణ, ఉప సర్పంచ్, శెట్టిపల్లి పంచాయతీ

తుమ్మలగుంటలో ముమ్మరంగా
వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

ప్రజాశక్తి-క్యాంపస్: వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయానికి భక్తులు భారీగా చేరుకునే అవకాశం ఉన్నందున విశేష పుష్పాలంకరణ, పచ్చని తోరణాలతో సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

'క్షేత్రస్థాయి నుండి కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తాం'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): క్షేత్రస్థాయి నుండి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తూ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తామని కాంగ్రెస్ పార్టీ తిరుపతి పట్టణ అధ్యక్షులు యార్లపల్లి గోపి అన్నారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ తీరు వల్ల ప్రజలు తీవ్రస్థాయిలో ఇబ్బందులకు గురవుతున్నారని, రానున్న 2024ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడానికి ప్రతి ఒక్క కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా 21మందితో ఏర్పాటైన తిరుపతి పట్టణ నూతన కమిటీని మీడియాకు పరిచయం చేశారు. కార్యక్రమంలో నాయకులు పటేల్ అబ్దుల్ మజీద్, డిసిసి ఉపాధ్యక్షులు రవి, జిల్లా అధ్యక్షురాలు తేజోవతి, ఎన్ఎస్‌విఐ తిరుపతి జిల్లా అధ్యక్షులు జావేద్, యూత్ కాంగ్రెస్ నాయకులు వెంకటేష్ గౌడ్, జిల్లా ఓబీసీ కోఆర్డినేటర్ శాంతి పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న 20మంది రోగులకు గురువారం స్టెప్స్ సంస్థ ఆధ్వర్యంలో క్రిస్మస్, వైకుంఠ ఏకాదశిని సందర్భంగా బియ్యం, చక్కెర, చింతపండు, కందిపప్పు, నూనె, న్యూట్రిషనల్ పౌడర్, ఉద్దిపప్పు, రాగి పిండి, సేమియా, గోధుమపిండి, సోపులు పంపిణీ చేశారు. సంస్థ నిర్వాహకురాలు డాక్టర్ ప్రమీలమ్మ మాట్లాడుతూ మంచి పౌష్టిక ఆహారం తీసుకోవడం, సకాలంలో మందులు వాడడం వలన ఆరోగ్యంగా జీవించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, సిబ్బంది రమేష్, గాయత్రి, సురేష్, భాస్కర్, దేవేంద్ర, రోజా, కళావతి, సునీత పాల్గొన్నారు.

తుపాన్ బాధితులకు రిలీఫ్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: టైర్ల తయారీ, మొబిలిటీ సొల్యూషన్స్‌లో గ్లోబల్ బ్రిడ్జ్‌స్టోన్ కార్పొరేషన్లోని అనుబంధ సంస్థ బ్రిడ్జ్‌స్టోన్ ఇండియా ఆధ్వర్యంలో తుపాను బాధితులకు నవజీవన్ ఆర్గనైజేషన్‌తో సహకారంతో రిలీఫ్ కిట్ల కోసం రూ.23లక్షలను కేటాయించి కిట్లను పంపిణీ చేశారు. వ్యర్థాలను సేకరించేవారు, పారిశుధ్య కార్మికులు, మాన్యువల్ స్కావెంజర్లు ఈ కిట్‌లను అందజేశారు. బ్రిడ్జ్‌స్టోన్ ఇండియాకు చెందిన 20 మంది ఆంధ్రా ఉద్యోగులు ఈ ప్రాంతంలో సహాయక చర్యల్లో చురుకుగా పాల్గొన్నారు.

పార్లమెంటును రక్షించలేని
పాలకులు ప్రజలను ఎలా రక్షిస్తారు: సీపీఐ

ప్రజాశక్తి-గూడూరు రూరల్: పార్లమెంటును రక్షించలేని పాలకులు ప్రజలనెలా రక్షిస్తారని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి ధ్వజమెత్తారు. గురువారం పట్టణ సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ సమితి సభ్యులు, శాఖా కార్యదర్శుల సమావేశం ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు చల్లా వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్.ప్రభాకర్, నియోజకవర్గ కార్యదర్శి శశి కుమార్, గుండాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఆర్ఎం మండల కన్వీనర్ల నియామకం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాధా-రంగా మిత్రమండలి శ్రీకాళహస్తి నియోజకవర్గ మండల కన్వీనర్లను గురువారం ఎంపిక చేశారు. ఆ మండలి నియోజకవర్గ అధ్యక్షులు సిద్దులుగారి ప్రసాద్ సమక్షంలో ఈ ఎంపిక జరిగింది. శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడిగా నరసయ్య, ఏర్పేడుకు కృష్ణమూర్తి, తొట్టంబేడు చిరంజీవులు, రేణిగుంట ముని రాధయ్యలను నియమించారు.

ఎస్వీయూలో విదేశీ ప్రొఫెసర్ సందర్శన

ప్రజాశక్తి-క్యాంపస్: యుకెలోని డర్హమ్ యూనివర్సిటీలో పరిశోధన చేసి, మలేషియాలోని విశ్వవిద్యాలయంలో ఫుడ్ సైన్స్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఆచార్య శామ్సుల్ బిన్ అబ్ రజాక్ గురువారం ఎస్వీయూ ప్రాచ్య పరిశోధన సంస్థను సందర్శించారు. ఈ సందర్భంగా వారు సంస్థలోని వివిధ తాళపత్ర సంపదను చూసి ఆశ్చర్యచకితులయ్యారు. తమ దేశంలో పెపారస్ చెట్టు బెరడును గ్రంథ రచనకు ఉపయోగిస్తారని చెప్పారు. సంస్థ నిర్వహణ, పరిశోధనలను అభినందించారు. సంస్థ సంచాలకులు డాక్టర్ పిసి వెంకటేశ్వర్లు వారికి గ్రంథాలయాన్ని పరిచయం చేశారు. కార్యక్రమంలో ఆచార్య బి.దేవప్రసాద్ రాజు, డాక్టర్ వెంకటేష్, డా.రాజశేఖర్, సిద్దయ్య, సంతోష్, హరికృష్ణ, సోమలింగయ్య, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

సమన్వయంతో సేవలందించండి

- డెప్యుటేషన్ సిబ్బందితో టీటీడీ జేఈవో

ప్రజాశక్తి-తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబరు 23 నుంచి జనవరి ఒకటో తేదీ వరకు పది రోజులపాటు వైకుంఠ ద్వార దర్శనానికి సంబంధించి సమన్వయంతో భక్తులకు సేవలు అందించాలని డెప్యుటేషన్ సిబ్బందికి టీటీడీ జేఈవో వీరబ్రహ్మం సూచించారు. తిరుమల వైభోత్సవ మండపంలో గురువారం సాయంత్రం డెప్యుటేషన్ సిబ్బందితో జేఈవో సమావేశం నిర్వహించారు. ఈ విశేష ఉత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అనుసరించిన ప్రణాళికను తెలియజేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని పర్యవేక్షక అధికారులకు సూచించారు. తిరుమలలో స్థానికుల కోసం ఏర్పాటు చేసిన కౌంటర్లో వారి ఆధార్ కార్డులో తిరుమల అడ్రసును పరిశీలించిన అనంతరం ఉచితంగా సర్వదర్శనం టోకెన్లు జారీ చేస్తామన్నారు.

ఘనంగా రైల్వే పెన్షనర్స్ దినోత్సవం

ప్రజాశక్తి-రేణిగుంట: పెన్షనర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఫంక్షన్లలో సమస్యలపై పాట్రన్, చీఫ్ అడ్వైజర్ సంజీవప్ప, బ్రాంచ్ చైర్మన్, డివిజనల్ ప్రెసిడెంట్, రేణిగుంట బ్రాంచ్ కార్యదర్శి జయంత్ కుమార్, సిఆర్ఎస్ రైల్వే డాక్టర్ హిమజ, శెట్టిపల్లి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ శేఖర్, సికింద్రాబాద్ ఆల్ ఇండియా రైల్వే రిటైర్డ్ మెన్స్ ఫెడరేషన్ నాయకులు జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్, జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ శివకుమార్, జోనల్ సెక్రెటరీ యుగంధర్, సెంట్రల్ ట్రెజరర్ ఎన్ఆర్సి రాజు, జోనల్ వైస్ ప్రెసిడెంట్ రామచంద్రుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ గుంతకల్ డివిజనల్ సెక్రెటరీ డాక్టర్ వి సుంకప్ప పాల్గొన్నారు.

జగనన్న ఉంటేనే సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని మంత్రి రోజా సోదరులు రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం రూరల్ తుడుకు పంచాయతీలో ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, చేసిన అభివృద్ధిని వివరించారు. వైసీపీ జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలమ్మ, వైస్ ఎంపీపీలు మునస్వామిరెడ్డి, సింగల్ విండో చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ నైపుణ్యంపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి-క్యాంపస్: ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో కౌటిల్య ఇన్స్టిట్యూషన్ చే 'కెరీర్ అవేర్ నెస్' అనే అంశంపై డిగ్రీ విద్యార్థులకు గురువారం సెమినార్ నిర్వహించారు. డైరెక్టర్-శ్రీధర్, సీనియర్ మేనేజర్ ఎన్.ఎస్.రెడ్డి, ఎల్.ప్రేమానంద రెడ్డి, ప్రిన్సిపాల్- డాక్టర్ టి.నారాయణమ్మ, డాక్టర్ బి.సత్య నారాయణ, మోహన మూర్తి తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చు.. సుస్థిర కార్గో సేవలు

- శ్రీసిటీ-సిద్ధార్థ లాజిస్టిక్స్ పరిశ్రమలో అధునాతన "డ్రై పోర్ట్" సదుపాయం

- ఈ ప్రాంత వాణిజ్య వృద్ధి, విస్తరణకు అత్యంత ప్రయోజనకరం

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: 28 దేశాలకు చెందిన 210 పైచిలుకు పరిశ్రమలతో పారిశ్రామిక ప్రగతితో ముందుకుపోతున్న శ్రీసిటీతో పాటు, శ్రీసిటీ జంక్షన్ గా చెన్నై-తిరుపతి-నెల్లూరును కలుపుతూ ట్రై-సిటీ పారిశ్రామిక కారిడార్‌కు కూడా వేగంగా అడుగులు పడుతోంది. దీంతో ఈ ప్రాంతంలో బలమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ నెలకొంది. ఫలితంగా అపోలో టైర్స్, హీరో మోటార్స్ వంటి కంపెనీల ఏర్పాటుతో పాటు ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్ రంగాలకు చెందిన పలు పరిశ్రమలు తమ ప్లాంట్ల స్థాపనకు మొగ్గుచూపుతున్నాయి. దీంతో కార్గో సేవలకు డిమాండ్ ఎక్కువవుతోంది. శ్రీసిటీ ద్వారా మాత్రమే అంతర్జాతీయ కార్గో ట్రాఫిక్ ఏడాదికి సుమారు 1,20,000 కంటైనర్లకు చేరుకుంది. చెన్నై, ఎన్నూర్, కట్టుపల్లి, కృష్ణపట్నంతో సహా కీలకమైన ఓడరేవుల అనుసందానం ఉన్నప్పటికీ, కార్గోలను రవాణా చేయడంలో పలు సవాళ్లను ఎదుర్కొవలసివుంది, రవాణా సమయం, రవాణా ఖర్చులు పెరుగుతున్నాయి.

ఏర్పాటైన "డ్రైపోర్ట్":

కార్గో సేవలకు పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో శ్రీసిటీలో ఏర్పాటు చేసిన "డ్రై పోర్ట్" గా పిలువబడే ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపో ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇది సమగ్ర లాజిస్టిక్స్ సెంటర్‌గా పనిచేస్తుంది. ఓడరేవు తరహా సౌకర్యాలను కలిగివుండడం, సమర్ధవంతంగా సులభతర కార్గో సేవల నిర్వహణ, రవాణా ఖర్చు, సమయాన్ని తగ్గించడం దీని ప్రత్యేకత. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్ డైరెక్ట్ ట్యాక్సస్, కస్టమ్స్ నిబంధనల మేరకు ఓడ రేవులకు 200 కిలోమీటర్ల లోపులకు అనుమతి లేదు. అయితే, కస్టమ్స్ చట్టం నిబంధనల ప్రకారం, శ్రీసిటీలోని 'ఫ్రీ ట్రేడ్ వేర్ హౌసింగ్ జోన్' లో ఉన్న సిద్ధార్ద లాజిస్టిక్స్ ఏర్పాటు చేసుకున్న ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపో (డ్రై పోర్ట్) వంటి సదుపాయానికి, 200 కిలోమీటర్ల పరిధి నిబంధన వర్తించదు. ఈ మేరకు సిద్ధార్థ లాజిస్టిక్స్ పరిశ్రమ డ్రై పోర్ట్‌ను నిర్వహించేందుకు అనుమతి పొంది, అధునాతన సదుపాయాలతో పెద్ద ఎత్తున కార్యకలాపాలను మొదలుపెట్టింది.








సిద్ధార్థ లాజిస్టిక్స్ పరిశ్రమ

క్రైం న్యూస్

లాడ్జిలో ఎన్ఆర్ఐ ఆత్మహత్య



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతిలోని ఓ లాడ్జిలో ఎన్ఆర్ఐ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈస్ట్ పోలీసుల కథనం మేరకు.. తిరుపతి పెద్ద కాపు వీధి లేఔట్ లోని ఓ లాడ్జిలో మన్యం జిల్లా సాలూరుకు చెందిన ఎన్ఆర్ఐ చిగురుకోట ఉపేంద్ర కుమార్ (52) రెండు రోజుల క్రితం గది అద్దెకు తీసుకున్నాడు. మంగళవారం నుంచి అతను గది నుంచి బయటకు రాకపోవడంతో గమనించిన లాడ్జి సిబ్బంది గురువారం ఉదయం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గది తలుపులు బద్దలు కొట్టారు. గదిలోపల ఉపేంద్ర కుమార్ ఫ్యాన్ కి ఉరివేసుకొని మతి చెందడాన్ని గమనించారు. మతదేహాన్ని పరిశీలించి, పంచనామ నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం మతదేహాన్ని రుయా ఆసుపత్రికి తరలించారు. మతుడు వద్ద ఉన్న సమాచారం మేరకు అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

భర్త హత్య కేసులో భార్య, ప్రియుడు అరెస్ట్

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: భర్తను హత్య చేసిన ఘటనలో భార్య ఆమె ప్రియుడ్ని అదుపులోకి తీసుకున్నట్లు వెస్ట్ డిఎస్‌పి యశ్వంత్ రెడ్డి తెలిపారు. తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 15న చిగురువాడ వైఎస్సార్ కాలనీలో గోవింద్ అనే వ్యక్తి మృతి చెందిన విషయం తెలిసిందే. గోవింద్‌కు సోంపల్లి మానసకు నాలుగు నెలల క్రితం వివాహం జరిగింది. ఆమె పెళ్లికు ముందే పలాసి సింహాద్రిని ప్రేమించింది. కుటుంబ సభ్యులు బలవంతంగా ప్రియులను కాదని వేరే వ్యక్తితో వివాహం చేయడంతో, విధి లేని పరిస్థితులు వివాహం చేసుకుంది. కానీ ఆమె ప్రియుడిని మరవలేదు. భర్తను తొలగిస్తే తాను ప్రియుడుతో కలిసి సుఖంగా బ్రతకవచ్చని పథకం వేసింది. ఈనెల 15వ తేదీ ప్రియుడుతో కలిసి భర్త గొంతు నిలిమి హత్య చేశారు. గోవింద్‌ది సాధారణ మృతిగా అందరిని నమ్మించేందుకు ప్రయత్నించారు. కానీ పోలీసులు రంగ ప్రవేశం చేసి, విచారణ చేపట్టడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో పరారీలో ఉన్న మానస, ఆమె ప్రియుడ్ని తిరుపతి-చంద్రగిరి 150 బైపాస్ రోడ్‌లో అనుమానస్పదంగా తిరుగుతున్న వారిని తిరుపతి రూరల్ పోలీసులు అదుపులో తీసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వెల్లడించారు. కేసు ఛేదించిన పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సమావేశంలో సిఐ సుబ్రహ్మణ్యం రెడ్డి, ఎస్ఐలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-క్యాంపస్: జాతీయ స్థాయిలో జరిగిన జవహర్ నవోదయ విద్యాలయ పరీక్ష ఫలితాల్లో తిరుపతి విశ్వం విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యధిక సీట్లు సాదించారు. మొదటి, 2వ జాబితా ఫలితాల్లో 49మంది విద్యార్థులు ఎంపికైయ్యారు. గురువారం విడుదలైన 3వ జాబిత ఫలితాల్లో వెంకట మోహన్ కృష్ణ, నిశంత్‌లతో పాటు మొదటి జాబితా ఫలితాల్లో ఎన్.తనీష్, కే.నీలేష్ రోషన్, ఎడ్డల జాన్సీ, ఓంకార్, ఈ.జనిత్, కే.హర్షిత్, బీ.చందు ప్రజ్వల్, జీ.కార్తీకద్యుతి, బీ.హేమంత్ కుమార్, పీ.జ్ఞానేంద్ర రెడ్డి, ఎం.తీర్థ, టి.పీ.రాజ్ ప్రియన్, జే.శసంక్, ప్రణీత్, ఏ.నిఖిల్ మనీష్ తదితరులతో పాటు 51 మంది విద్యార్థులు సీట్లు సాధించారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ యన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను అభినందించారు. అకడమిక్ డైరెక్టర్ యన్.విశ్వ చందన్‌రెడ్డి, కరస్పాండెంట్ యన్.తులసీ విశ్వనాథ్‌లు విద్యార్థులను అభినందించారు.



ఎంపికైన విద్యార్థులు

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపణీ

ప్రజాశక్తి-పిచ్చాటూరు: ప్రభుత్వం అందజేసిన ఉచిత ట్యాబ్‌లను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గురువారం విద్యార్థులకు అందజేశారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన హాజరై 8వ తరగతి విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, తహశీల్దార్ మధుసూదన్‌రావు, ఎంఈఓ హేమాలిని, యుగంధర్‌రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓజిలి: స్థానిక జెడ్పి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ఎంఈవో శైలజ, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ట్యాబ్‌లు పంపిణీ చేశారు. మండలంలో 170మందికి ట్యాబ్‌లు అందజేశారు.

యర్రావారిపాలెం: మండలంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లు అందజేసినట్లు ప్రిన్సిపల్ బిటి.శ్రీదేవి తెలిపారు. ఎంపీపీ శివలక్ష్మి, వైస్ ఎంపీపీ నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ రేవతీరెడ్డెప్పరెడ్డి, జడ్పిటిసి కరుణాకర్ రెడ్డి, చెంగల్ రెడ్డి, నాగార్జున రెడ్డి, ఎంపీటీసీ సునీల్, చైర్మన్ రవీంద్రనాథ్ రెడ్డి చేతుల మీదుగా ట్యాబ్‌లను అందజేశారు.

కేవిబి పురం: మండలంలోని ఆదర్శ పాఠశాలలో ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ట్యాబ్‌లను 8వ తరగతి విద్యార్థులకు అందజేసినట్లు ప్రిన్సిపల్ మోహన్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మునిలక్ష్మీ నందకుమార్, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, హరి, నాగయ్య, జగదీష్, రాముదర్మ, ఎంపీటీసీ అయ్యప్పరెడ్డి, సర్పంచ్ గిరి పాల్గొన్నారు.

గూడూరు టౌన్: రాష్ట్ర ప్రభుత్వ 8వ తరగతి విద్యార్థులకు అందజేస్తున్న ట్యాబ్‌లను గురువారం ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, స్వచ్ఛఆంధ్ర సంస్థ చైర్ పర్సన్ దేవసేనమ్మ చేతుల మీదుగా అందజేశారు. గూడూరు పట్టనంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమం జరిగింది. నాయకులు విజయకుమార్, సురేష్‌రెడ్డి, గోపాల్‌యాదవ్, ముని, సాయి, ఇమ్రాన్, అజీజ్ ఖాన్, గోపియాదవ్ పాల్గొన్నారు.



కేవిబి పురం: ట్యాబ్‌లు అందజేస్తున్న నాయకులు

వెంకటగిరిరూరల్: మండలంలోని కలవలపూడి హైస్కూల్‌లో సీఎం పుట్టినరోజు సందర్భంగా వైస్ ఎంపీపీ సుధాకర్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు.

పుత్తూరు టౌన్: మండల కేంద్రంలోని జెడ్పి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను ఎంఈవో తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, హెచ్ఎం భువనేశ్వరి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంగి, ఎంపీపీ ముని వేలు, నాయకులు మహీన్, శంకర్, సుధా పాల్గొన్నారు.

చెకుముకి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, బాలికల పాఠశాలలో జనజ్ఞాన వేదిక అధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా గురువారం మండల స్థాయి టాలెంట్ పరీక్ష నిర్వహించారు. ఎంఈవో తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం పాల్గొని విద్యార్థులకు సైన్స్ ఆవశ్యకతను వివరించారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో మండల స్థాయిలో మొదట స్థానంలో జ్ఞానజ్యోతి విద్యామందిర్ విద్యారులు రిషికేష్, రిషిత, ప్రత్యూష, రెండవస్థానంలో జెడ్పి ఉన్నత పాఠశాల వేపగుంట విద్యార్థులు హాసిని, లిఖిత, తేజేష్ మూడవ స్థానంలో వివేకానంద విద్యార్థులు ధనుష్, చరణ్‌తేజ్, కావ్యలకు బహుమతులు అందజేసారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక పుత్తూరు డివిజన్ ప్రధానకార్యదర్శి విజయనాగు, భువనేశ్వరి, ఉపాధ్యాయులు నరేంద్ర, సుధారాణి, షకీల, కీలు, వేలు, వెంకటేశులు, రమేష్, వనజాక్షి పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: మండలంల కేంద్రంలోని జెడ్పి ఉన్నత పాఠశాలలో గురువారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన మండల స్థాయి చెకుముకి ప్రశ్నాపత్రాలను హెచ్ఎం రమణయ్య విడుదల చేశారు. పరీక్షలో విజేతలుగా నిలిచిన జెడ్పి హైస్కూలు నెలవాయి విద్యార్థులు ఆకాష్, దీప, హిమజ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులు కార్తీక్, మేఘన, విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైయ్యారు. వీరికి ఎంఈవో రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో చెంగయ్య, వెంకటరమణయ్య, సురేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆక్స్‌ఫర్డ్‌లో జాతీయ గణిత దినోత్సవం

ప్రజాశక్తి-రేణిగుంట: జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని రేణిగుంటలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ స్మరించుకుంటూ ఆక్స్‌ఫర్డ్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ లో గురువారం గణిత పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొని విభిన్న కాన్సెప్ట్‌లపై విభిన్న ట్రిక్స్, పజిల్స్, థియరమ్స్, వర్కింగ్ మోడల్స్ తయారు చేసి తమ ప్రతిభను ప్రదర్శించారు. న్యాయమూర్తులు డాక్టర్ నెల్లూరు మునిలక్ష్మి శ్రీదివ్య జ్ఞాన్ సేవా కేంద్రం నడ్డి నారాయణ్ (దూరదర్శన్ కేంద్రం-తిరుపతి) తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ జి. గౌతమి మాట్లాడుతూ ఇటువంటి పోటీల ద్వారా విద్యార్థుల ఆలోచనల్లో మార్పు వచ్చి, నూతన అన్వేషణలో ఆలోచిస్తారన్నారు. విద్యార్థులు వారి లక్ష్యాలను చేరుకోవడానికి ఈ తరహా పోటీలు ఎంతో నైపుణ్య జ్ఞానాన్ని అందిస్తాయన్నారు.

క్యాంపస్: గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజులను స్మరించుకుంటూ ఆక్స్‌ఫర్డ్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో గణిత పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో విద్యార్థులు పాల్గొని విభిన్న కాన్సెప్ట్‌లపై విభిన్న ట్రిక్స్, పజిల్స్, థియరమ్స్, వర్కింగ్ మోడల్స్ తయారు చేసి తమ ప్రతిభను ప్రదర్శించారు. న్యాయమూర్తులు డాక్టర్ నెల్లూరు మునిలక్ష్మి, మామ్‌శ్రీ, దివ్య జ్ఞాన్ సేవా కేంద్రం, నడ్డి నారాయణ్ దూరదర్శన్ కేంద్రం-తిరుపతి, తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించారు. పాఠశాల కరస్పాండెంట్ జి.గౌతమి పాల్గొన్నారు.

నకిలీ ఓట్లను నివారించాలి : అబ్జర్వర్ భాస్కర్



ప్రజాశక్తి-గూడూరు టౌన్: నకిలీ ఓట్లను నివారించాలని రోల్ అబ్జర్వర్ పోల భాస్కర్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 55వ పోలింగ్ స్టేషను తనిఖీ చేశారు. బీఎల్‌వోలు తయారు చేసిన ఓటరు నమోదు ఫారాలను నిశితంగా పరిశీలించారు. అనంతరం బి.ఎల్.ఓలకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్, తహశీల్దారు బాల లీలారాణి,మునిసిపల్ కమీషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు తనిఖీ

ప్రజాశక్తి-రామచంద్రాపురం: రానున్న ఎన్నికల నేపథ్యంలో మండలంలోని వివిధ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను డీఎస్పీ డాక్టర్ యశ్వంత్ గురువారం పరిశీలించారు. మండలంలోని అనుపల్లి, సికె పల్లి, ఎన్ఆర్ కమ్మపల్లి, రావిళ్లవారిపల్లి, కమ్మ కండ్రిగ, కుప్పం బాదురు, సి.రామాపురం నడవలూరు, నెన్నూరు, నడవలూరు, గంగిరెడ్డిపల్లి, గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను స్వయంగా పరిశీలించారు. ఎన్నికల కమిషనర్‌కు నివేదిక పంపనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై గిరిబాబు, స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ మదన్మోహన్, త్యాగరాజులు, సురేష్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



వేలం పాటలో రూ.4.50లక్షలు ఆదాయం

ప్రజాశక్తి-ఏర్పేడు: స్థానిక గ్రామ పంచాయతీ దుకాణాలకు గురువారం వేలం పాట నిర్వహించారు. సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శివయ్య అధ్యక్షతన పది దుకాణాలకు వేలం నిర్వహించగా రూ.4,50,126 ఆదాయం వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యం తెలిపారు.